janodaya
# జనోదయ

RNI No - APTEL/2022/81596

కరీంనగర్ గురువారం 16.04.2026 సంపుటి : 03 సంచిక : 130 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Thursday 16.04.2026 Volume: 03 Issue 130 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక




## వడివడిగా మహిళా కోటా

**నారీ శక్తి వందన అమలే లక్ష్యం**

**2029 ఎన్నికలకే ఈ చట్టం అములుకు నిర్ణయం**

**3 రోజులు..3 కీలక బిల్లులు**

**నేటి నుంచి పార్లమెంటు భేటీ**

4



# సీట్ల పెంపుపై గరం..గరం

**మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై పార్లమెంటులో వాడీవేడీ చర్చలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో సీట్ల పెంపు, మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేయగా.. వాటిని వ్యతిరేకిస్తూ తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపేందుకు కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి.**

## ఎన్డీయే దూకుడు..ప్రతిపక్షాల మండిపాటు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 :** లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో సీట్ల పెంపు, మహిళలకు 33శాతం రిజర్వే షన్ కల్పించేందుకు ఉద్దేశించిన మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టేం దుకు మోదీ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేయగా.. వాటిని వ్యతిరేకిస్తూ తీవ్రస్థాయిలో నిరసనలు తెలిపేందుకు కాంగ్రెస్ నేతృ త్వంలో ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. మరోవైపు మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ కోటా ఉండాలని.. 2011 లెక్కల ప్రకారం డీలిమిటే షన్‌ను అంగీకరించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎస్సీ, ఓబీసీ విభాగా లు నేడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు సిద్ధమవుతున్నాయి. నేడు పార్లమెంటులో మూడు బిల్లులను ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టను ంది. మహిళలకు రిజర్వేషన్ కల్పించి, లోక్‌సభ సీట్లను 850కు పెంచేం దుకు 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు.. 2011 జనాభా లెక్కల ప్రాతిపది కన చట్టసభల్లో సీట్లను పెంచడం కోసం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన డీలిమిటేషన్ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెడుతుండగా.. కేంద్ర పాలిత ప్రాంతాల్లో సీట్లను పెంచేం దుకు ఉద్దేశించిన కేంద్ర పాలిత ప్రాంతాల చట్టం సవరణ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశ పెట్టనున్నారు.



## దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు లేవు

### అధికారికంగా ప్రకటించిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 :** దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు ఏవీ లేవని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారిక ప్రకటనలో తెలియజేసింది. భారత దేశంలో వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఈ) ఉద్భవించి ఐదు దశాబ్దాలకు పైగా గడిచిందని, ప్రస్తుతం వారి ప్రభావం దేశంలో ఎక్కడా లేదని కేంద్రం తెలిపింది.దేశంలో నక్సల్స్ ప్రభావం ఉన్న తొమ్మిది రాష్ట్రాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని తెలిపిందని అధికారులు వెల్లడించారు. 'దేశంలోని ఏ జిల్లా కూడా ఇకపై ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత క్యాటగిరీలో లేదు' అని ఆ ప్రకనటలో పేర్కొన్న ది. కాగా, దేశాన్ని మావోయిస్టు రహితంగా తీర్చిదిద్దినట్టు హోం మంత్రి అమిత్ షా మార్చి 30న పార్లమెంట్‌లో ప్రకటించారు. దేశంలో నక్సలిజాన్ని మార్చి 31నాటికి అంతం చేయాలనే లక్ష్యంతో కేంద్రం నిర్వహించిన ఆపరేషన్ విజయవంతమైందని ఆయన చెప్పారు.

## బీహార్ సీఎంగా సమ్రాట్ చౌదరి ప్రమాణం



**పాట్నా :** బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ సయ్యద్ అత్ హస్నైన్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం, జేడీ (యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సమ్రాట్ చౌదరికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజాసేవ పట్ల ఆయన అంకిత భావం, క్షేత్రస్థాయి అనుభవం రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాగా, ఇద్దరు జేడీ(యూ) నేతలు ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టవచ్చునని భావిస్తున్నారు. ఈ రోజు నుంచే తాను పనిలోకి దిగుతానని, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీఎం నితీశ్ కుమార్ అభివృద్ధి చేసినా పాలనా విధానాలను రాష్ట్రంలో అనుసరిస్తానని చౌదరి మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# ఆర్‌సీబీ టాప్ షో

**జోష్ హాజిల్‌వుడ్ అదుర్స్**

**రాణించిన విరాట్ కోహ్లీ**

**లక్నోపై బెంగళూరు ఘన విజయం**



**బెంగళూరు:** ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగ ళూరు(ఆర్‌సీబీ) వరుస విజయాలతో దుమ్మురేపుతున్నది. రాజస్థాన్ రాయ ల్స్‌తో మ్యాచ్‌లో ఓటమి మినహా యిస్తే..ముంబై ఇండియన్స్‌ను వారి సొంతగడ్డపైనే మట్టికరిపించిన ఆర్‌సీబీ..లక్నో సూపర్‌జె యింట్స్ (ఎల్‌ఎస్‌జే) భరతం పట్టింది. చిన్నస్వా మిలో గత ఓటములకు దీటైన ప్రతీ కారం తీర్చుకుంటూ ఆర్‌సీబీ తొలిసారి విజయాన్నందుకుంది. బుధవారం కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య సాగిన పోరులో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో 8 పాయింట్లతో ఆర్‌సీబీ అగ్రస్థానంలోకి దూసుకెళ్లగా, లక్నో వరుసగా రెండో ఓటమితో ఏడో స్థానంలో కొనసాగుతున్నది. తొలుత హాజిల్‌వుడ్(4-0-20-1), రసిక్ సలామ్(4/24), భువనేశ్వర్(3/27) ధాటికి లక్నో 20 ఓవర్లలో 146 ఆలౌటైంది. మిచెల్ మార్ష్(40), ముకుల్ చౌదరి(39), ఆయూశ్ బదోని(38) ఒకింత ఆకట్టుకున్నా.. మిగతావారు ఘోరంగా విఫల మయ్యారు. పిచ్ పిరిస్థితులను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ టాస్ గెలిచిన ఆర్‌సీబీ బౌలింగ్ ఎంచు కున్నది. కెప్టెన్ రిషబ్ పంత్(1), నికోలస్ పూరన్(1), అబ్దుల్ సమద్(0) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమ య్యారు.ఆ తర్వాత 147 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన ఆర్‌సీబీ 15.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(34 బంతుల్లో 49, 6ఫోర్లు, సిక్స్) పరుగు తేడాతో అర్ధసెంచరీ అవకాశాన్ని చేజార్చుకోగా, రజత్ పటిదార్(27), జితేశ్‌శర్మ (23) ఆకట్టుకున్నారు. ప్రిన్స్ యాదవ్ (3/32), అవేశ్‌ఖాన్ (2/23) రాణిం చారు. పొదుపైన బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన హాజిల్‌వుడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్

**రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు కొనసాగింపు**

**పొలిట్‌బ్యూరోలో 29 మందికి చోటు**

**జాతీయ కమిటీలో 31.. రాష్ట్ర కమిటీలో 185 మంది**

**అమరావతి, ఏప్రిల్ 15 :** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియమితులయ్యారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ముఖ్య మంత్రి చంద్రబాబు కొనసాగను న్నారు. గత మహానాడులో జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఎన్నికైన విషయం తెలిసిందే. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావునే కొనసాగించాలని నిర్ణయించారు. పార్టీ పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను బుధవారం ప్రకటించారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. జాతీయ కమిటీలో... జాతీ య ప్రధాన కార్యదర్శులుగా ముగ్గ రు, జాతీయ ఉపాధ్యక్షులుగా 18 మంది, జాతీయ అధికార ప్రతినిధు లుగా 10 మందిని నియమించారు. రాష్ట్ర కమిటీలో.. రాష్ట్ర ప్రధాన కార్య దర్శులుగా ఏడుగురు, రాష్ట్ర ఉపాధ్య క్షులుగా 16 మంది, రాష్ట్ర అధికార ప్రతినిధులుగా 14 మంది, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేట ర్లుగా 10 మం ది, రాష్ట్ర కార్యనిర్వా హక కార్యద ర్శు లుగా 59 మంది, రాష్ట్ర కార్యద ర్శు లుగా 77 మందిని నియమించారు.



## దక్షిణాదికి అన్యాయం చేస్తే తిరుగుబాటు

**ఉద్యమానికి కేసీఆరే నాయకత్వం వహిస్తరు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**మేడ్చల్, ఏప్రిల్ 15 :** డీలిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో తిరుగుబాటు చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. డీలిమి టేషన్‌పై కేంద్రం చెప్పింది ఒకటి.. నేటి నుంచి జరిగే లోక్‌సభ సమావేశాల్లో పెట్టే బిల్లు మరోటి అని, ఈ బిల్లులో 50 శాతం సీట్ల పెంపు లేనే లేదని విమర్శించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాడు 2014లో డీలిమిటేషన్ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోనే ఉన్నదని, దాన్ని తుంగలో తొక్కిందే బీజేపీ అని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు బీఆర్ఎస్ అనుకూలమని పునరుద్ఘాటించారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా..**

**జనోదయ : చెన్నూర్ ఆర్సీ , ఏప్రిల్ 15**



రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో జైపూర్ సిఐ నవీన్, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ ..అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జోన్ డీసీపీ ఏ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విద్యార్థులతో మాట్లాడారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలను నేర్చుకుని పాటించడం చాలా ముఖ్యమని తెలిపారు. విద్యార్థి దశలో అలవర్చుకున్న మంచి అలవాట్లు భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని, హెల్మెట్ , సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ఈ నియమాలను కేవలం మనమే పాటించడం కాకుండా, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు కూడా వివరించి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యతపై వివరించారు, ప్రతి ఒక్కరూ నియమాలను గౌరవించి పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా వ్యక్తిగతంగా, కుటుంబ స్థాయిలోనే కాకుండా సమాజం మరియు రాష్ట్రానికి కూడా మేలు జరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రాఫిక్ నియమాలు పై డ్రాయింగ్ వేయగా సిపి డిసిపిలు వాటిని పరిశీలించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు పోస్ట్ కార్డు ద్వారా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీటు బెల్టు ధరించాలని ట్రాఫిక్ నియమాలు పాటించాలని రహదారి క్రమశిక్షణ కలిగి ప్రవర్తించాలని పోస్ట్ కార్డు రాసి తల్లిదండ్రులకు పంపించారు. అదేవిదంగా ట్రాఫిక్ నియమాలు రహదారి భద్రత నియమా లను పాటిస్తామని అదేవిధంగా కు టుంబ సభ్యులతో పాటించేలా చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

## పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా సంక్షేమ అధికారి పి. వేణుగోపాల్ రావు**

**పెద్దపల్లి, ఏప్రిల్ 15 (జనోదయ):**

హైదరాబాద్‌లోని శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణా సంస్థలో 2026-2027 విద్యా సంవత్సరానికి గానూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి. వేణుగోపాల్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, పాక్షిక అనాథలు (తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు), నిరుపేద బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, దివ్యాంగ బాలికలు, పదవ తరగతి పూర్తి చేసిన అర్హులైన బాలికలు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు.డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సెమీ కండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ల్యాండ్ స్కేప్ 3 సంవత్సరాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (అనాథలకు మినహాయింపు), మరణ ధ్రువీకరణ పత్రం (అనాథలకు మాత్రమే ), బోనఫై డ్, స్టడీ సర్టిఫికేట్లు, 2పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో జతచేసి మే 25 లోపు పెద్దపల్లి పట్టణంలోని కోర్టు సమీపంలోని బాల రక్ష భవన్ కార్యాలయం నందు సమర్పించాలని, ఎంపికైన విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి కల్పించబడుతుందని, పూర్తి వివరాలకు 9966676181, 6300398362 నంబర్లను సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గడువులోగా అభివృద్ధి పనులు పూర్తికావాలి

**శేరిలింగంపల్లి జోన్‌లో సమీక్షా సమావేశంలో సిఎంసి కమిషనర్ జి.సృజన**

**జనోదయ : శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15 :**



శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సిఎంసి కమిషనర్ జి సృజన బుధవారం జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూబీడీ , యూసీడీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులన్నింటినీ '99 రోజుల ప్రోగ్రాం'లో భాగంగా జూన్ 2, 2026 లోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కనీసం 190 పనులను ఈ గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.జోన్‌లోని అన్ని రోడ్లకు ఎండ్-టు-ఎండ్ కార్పెటింగ్ చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా జూన్ 2 లోపు మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ చివరి నాటికి జోన్ అంతటా పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీధి దీపాల సమస్యలపై అసిస్టెంట్ ఇంజనీర్లు తక్షణమే స్పందించాలని, ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. క్రీడా ప్రాంగణాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు వంటి ప్రభుత్వ ఆస్తుల పూర్తి సమాచారాన్ని సేకరించాలని, ఖాళీ స్థలాలకు 10 రోజుల్లోపు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు మే చివరి నాటికి పూర్తి కావాలని, దోమల నివారణకు ప్రతి 10 రోజులకు ఒక సారి ప్రతి ప్రాంతంలో ఫాగింగ్/స్ప్రే యింగ్ జరిగేలా షెడ్యూల్ రూపొందించాలని కమిషనర్ తెలిపారు.జంక్షన్ల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందు కోసం కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతనిధులను వినియోగించుకోవాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, విభాగాల మధ్య సమన్వయంతో పని చేస్తూ లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి వారం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## నెల 17న పెద్దపల్లిలో భారీ ఉద్యోగ మేళా నిర్వహణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి/మంథని, ఏప్రిల్- 15 (జనోదయ):**



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17 ఏప్రిల్ 2026న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.టాస్క్ (టాస్క్) రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ డ్రైవ్‌లో ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయను న్నాయని,ఈ నెల 17న శుక్రవారం ఉదయం 10:00 గం టల నుంచి పెద్దపల్లి టాస్క్ (టాస్క్) రీజినల్ సెంటర్, పెద్ద పల్లి బస్టాండ్ సమీపంలో గల టాస్క్ సెంటర్‌లో డిప్లొ మా,ఐటీఐ,ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాలకు అర్హులని, ఈ డ్రైవ్‌లో ఏజే సొల్యూషన్, వార్నర్స్ ఈవీ మోటా ర్స్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వంటి ప్రతి ష్టాత్మక సంస్థల ప్రతినిధులు పాల్గొని, ఇంటర్వ్యూల నిర్వ హించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని కలెక్టర్ తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట రెండు సెట్ల లేటెస్ట్ రెజ్యూమ్, అ భ్యర్థులు తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్‌లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, నిర్ణీత సమయం కంటే ముందుగానే వేదికకు చేరు కోవాలని, జిల్లాలోని అర్హత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని, మరిన్ని వివరాల కోసం పెద్దపల్లి లోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# జగిత్యాల కేసీఆర్ సభకు భారీగా తరలిరండి

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**జనోదయ : బోయినిపల్లి**




బోయినిపల్లి మండలంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య అధ్యక్షతన ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాల సభ చొప్పదండి ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 20న జగిత్యాలకు రానున్న సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి చేరిక నేపథ్యంలో ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించేలా గ్రామ ఇన్‌చార్జులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జగిత్యాల సభ చొప్పదండి ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. 'కేసీఆర్ రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలి' అనే నినాదంతో జగిత్యాల నుంచి జైత్రయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. జగి త్యాల సభకు బోయినిపల్లి మండలం నుంచి జైత్రయాత్రగా భారీగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ అజ్జు, సత్తినేని మాధవ్, మేడుదుల మల్లేశం, గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, కట్ట గోవర్ధన్, జంపుక ఆనంద్ నాయకులు పాల్గొన్నారు.

# పక్కా గృహం మంజూరి చేయించిన శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు



**జనోదయ, మంథని:**

పక్కా గృహం లేని తనకు సొంత ఇంటి కల నేటికి నిజమైనందుకు సంతోషంగా ఉందని మంథని మునిసిపాలిటీ పరిధిలోని నాలుగవ వార్డ్ కు చెందిన గడిపెల్లి మంగ ఆనందం వ్యక్తం చేశారు. తాను ప్రజా పాలనలో 02 జనవరి 2024 లో దరఖాస్తు చేసుకున్నానని అన్నారు. మంగళవారం సాయంత్రం ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా పక్క గృహం మంజూరి పత్రం అందుకున్నానని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు, నాలుగవ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం



**జనోదయ, మంథని:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రేపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల-కళాశాలలో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన కాళేశ్వరం జోన్-1 జోనల్ అధికారి సిహెచ్. గిరిజ ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో బుధవారం ముందస్తుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిఇపిఏ వ్యవస్థాపకుడు దార మధు పాల్గొని బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. విద్యా రంగానికి ఆమె అందించిన సేవలను గుర్తుచేస్తూ పలువురు అభినందనలు తెలిపారు. టిఇపిఏ సభ్యుడు కళ్ళేపల్లి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**గంగాధర పోలీస్ స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ**

**జనోదయ : గంగాధర:**




ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "రోడ్ సేఫ్టీ - అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గంగాధర మండలంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర పోలీస్ స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో గంగాధరలోని వివేకానంద పాఠశాల విద్యార్థులతో కలిసి గంగాధర ఎక్స్ రోడ్ వద్ద మానవహారం నిర్వహించారు. రోడ్డు నిబంధనలను పాటించడం ఎంత ముఖ్యమో, హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్ వినియోగం, మిత వేగం వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని అందించారు. తదుపరి వివేకానంద పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు నిబంధనల ప్రాముఖ్యతను సృజనాత్మకంగా వ్యక్తపరిచారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన మొదటి ఐదు మంది విద్యార్థులకు ఎస్సై వంశీకృష్ణ స్వయంగా బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్నప్పటి నుంచే పిల్లల్లో సరైన అవగాహన కలిగిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కరెంట్ ఉద్యోగుల షాక్ తప్పదు

**విద్యుత్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**

**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

**జనోదయ, హనుమకొండ, ఏప్రిల్ 15:**

కాంగ్రెస్ ప్రభుత్వానికి కరెంటు ఉద్యోగుల షాక్ తగులుతుంది అని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని నక్కల గుట్టలోని టీజీఎన్పీడీసీఎల్ కార్యాలయం వద్ద, ములుగు రోడ్డు వద్ద ఉన్న టీజీ ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఉద్యోగులు వారి హక్కుల కోసం చేస్తున్న ధర్నా వేదికలకు ఆయన బుధవారం హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టిజన్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని మాట తప్పింది అని మండిపడ్డారు. ఆర్టిజన్ల డిమాండ్లు న్యాయమైనవి అని, వారి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని హామీ ఇచ్చారు. అన్ మ్యాన్డ్ ఉద్యోగులను ఆర్టిజన్లుగా గుర్తించాలి అని, పీస్ వర్క్, వాచ్ మెన్, స్పాట్ బిల్డర్స్ వంటి వారికి వేతనలు పెంచాలి, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలి అని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులను టర్మినేట్ చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారు అని, ఒక వేళ ఒక్క ఉద్యోగిని తొలగించిన ఈ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు టర్మినేట్ చేస్తారు అని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సోదా కిరణ్, బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు పులి రజినీకాంత్, గొర్రె విజయ్,




ఈసంపెల్లి సంజీవ, గంద్రకోట రాకేష్ యాదవ్, వీరు, తక్కెళ్లపల్లి వినీల్ రావు, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆకాంక్షల ప్రతిబింబం

**వడివడిగా మహిళా కోటా**
**నారీ శక్తి వందన అమలే లక్ష్యం**
**2029 ఎన్నికలకే ఈ చట్టం అమలుకు నిర్ణయం**
**3 రోజులు..3 కీలక బిల్లులు**
**నేటి నుంచి పార్లమెంటు భేటీ**



ఢిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను సాధ్యమైనంత వేగంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో నేటి (గురువారం) నుంచి మూడు రోజుల పాటు పార్లమెంటు ఉభయ సభలు ప్రత్యేకంగా కొలువుదీరనున్నాయి. ఈ మూడు రోజుల్లో మూడు కీలక అంశాలపై చర్చించనున్నారు. సాధ్యమైనంత వేగంగా కోటా అమలు చేయడమే ఈ ప్రత్యేక భేటీ లక్ష్యమని కేంద్రం తెలిపింది. 2029 సార్వత్రిక ఎన్నికల నుంచి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలో మహిళలకు 33 శాతం కోటాను అమలు చేయాలని నిర్ణయించింది. రాజ్యాంగంలోని 106వ రాజ్యాంగ సవరణ కింద తీసుకువచ్చిన 'నారీ శక్తివందన అధినియం' వాస్తవానికి 2023, సెప్టెంబరులోనే పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆమోదం పొందింది. 2023, సెప్టెంబరు 20న లోక్‌సభ 454 అనుకూల ఓట్లతో దీనికి ఆమోదం తెలిపింది. కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే వ్యతిరేకించారు. రాజ్యసభలో అయితే.. 214 మంది సభ్యులు అదే ఏడాది సెప్టెంబరు 21న ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం.. సెప్టెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకంతో ఈ బిల్లు చట్టంగా మారింది. దీని ప్రకారం.. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అందివచ్చింది. అయితే.. ఈ చట్టం అమలుకు కొన్ని నిబంధనలు ఏర్పరిచారు. వీటి ప్రకారం.. 2034 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. అదేసమయంలో కొత్తగా జనాభా లెక్కలను అనుసరించే ఈ రిజర్వేషన్‌ను అమలు చేయాలని చట్టంలో పేర్కొన్నారు. దీంతో మహిళా రిజర్వేషన్ అమలు కోసం సుదీర్ఘకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2023లో చేసిన చట్టంలో పేర్కొన్న నిబంధనలను సవరించి.. 2029 ఎన్నికల నుంచే మహిళలకు కోటా ఫలాలు అందించే ప్రధాన లక్ష్యంగా నేటి నుంచి 3రోజుల పాటు పార్లమెంటును సమావేశపరుస్తున్నారు. తద్వారా గత చట్టంలోని 3రాజ్యాంగపరమైన నిబంధలను సవరించి.. కోటా అమలుకు ఉన్న అడ్డంకులను అధిగమించాలని కేంద్రం భావిస్తోంది.

## ఇంటర్‌లో 463 మార్కులు

**-రాష్ట్రస్థాయి ర్యాంకర్‌ను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే నరేందర్**
**-32వ డివిజన్ బీఆర్ఎస్ నేత డికొండ ప్రవీణ్ కుమార్తెకు సన్మానం**



**జనోదయ : వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ 32వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు డికొండ ప్రవీణ్ కుమార్తె ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 463 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంక్ దక్కించుకోవడం పట్ల గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం విద్యార్థినిని శాలువాతో సత్కరించిన ఆయన, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తూ.. పిల్లల విద్యలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి మంచి ఫలితాలు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని నరేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## చదువే పేదరికాన్ని దూరం చేస్తుంది

**చదువులకు దాతల సహకారం మరువలేనిది**
**వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ ఆశాలత**



**చర్ల : జనోదయ**

చదవే పేదరికాన్ని పారద్రోలుతుందని, విద్యార్థుల చదువులకు దాతల సహకారం మరువలేనిదని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర సుక్మా జిల్లా కుంట గ్రామానికి చెందిన ఇందన అప్పారావు జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు ఇందన రాంబాబు – వరలక్ష్మి దంపతులు వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్ అందచేసారు. ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయం ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి విద్యార్థి చదువులపై దృష్టి సారించాలని, చదువుతోనే పేదరికం దూరమవుతుందన్నారు. ఇందుకు మనకు అనేక ఉదాహరణలు కనపడుతున్నాయని, వారిని ఆదర్శంగా తీసుకొని చదువులపై దృష్టి సారించింది ఉన్నత స్థితికి చేరుకోవాలని విజ్ఞప్తి చేసారు. పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కదాతకు పేరుపేరునా కృత జ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచే విద్యార్థులు ఇందుకు అనుగుణంగా ప్రవర్తించి తల్లిదండ్రులతో పాటు సంస్థకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నిలయ కమిటీ అధ్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీ కృష్ణ, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, వనవాసీ జిల్లా సహ సంఘటనా కార్యదర్శి గొంది శోభన్ బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## మార్కెట్లలో రైతుల సమస్యలు పరిష్కరించాలి

**-తెలంగాణ రైతు సంఘం కన్వీనర్ సోమిడి శ్రీనివాస్**



**జనోదయ : వరంగల్ ప్రతినిధి:**

మార్కెట్లలో రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని వెంటనే పరిష్కరించాలని, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ ఛైర్మన్ కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పంట అమ్మడానికి వచ్చిన రైతులకు పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించడం లేదు అని వివరించారు.

## నారా లోకేష్ ఎంపికపట్ల మంత్రి, ఎమ్మెల్యే అభినందనలు



**గోడిశలపల్లిలో సంబరాలు**

**జనోదయ : డి. హీరేహాళ్ ఏప్రిల్ 15**


తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాబును నియమించడం పట్ల ఆపార్టీ నాయకులు రాయదుర్గం నియోజకవర్గంలో సంబరాలను వైభవంగా నిర్వహించారు. మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డి హిరేహాల్ మండలం గుడిసెలపల్లి గ్రామంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చుతూ కార్యకర్తల కోలాహలం మధ్య కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. లోకేష్ బలమైన నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరో 30 ఏళ్లపాటు మరింత పటిష్టపడుతూ ముందడుగు వేస్తుందని ఆశాభావం వ్యక్తపరిచారు. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేసిన నాయకుడు లోకేష్ అని ప్రశంసించారు. యువగళం ద్వారా అన్ని వర్గాల వారితో నేరుగా మమేకం కావడంతో పాటు జగన్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లీ రాజు,మండల పార్టీ అధ్యక్షుడు కాద లూరు మోహన్, టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీధర్ చౌదరి,ఎంపీటీసీలు తలారి గంగాధర్, మొండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

**కోట్ల రూపాయల వ్యయంతో గ్రామాల అభివృద్ధి మంత్రి పయ్యాయాల కేశవ్ , ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పల్లె పండుగ**

**జనోదయ : డి. హీరేహాళ్ ఏప్రిల్ 15**

గత వైసిపి పాలనలో ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రం అభివృద్ధికి నోచుకోకుండా తీవ్ర ఆర్థిక అభివృద్ధి సంక్షోభంలో కూరుకుపోయినదని కూటమిపాలన చేపట్టిన వెంటనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని మంత్రి పయ్యావుల కేశవ్ ,స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నటువంటి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు డి. హీరేహాళ్ మండలంలోని గోడిశల పల్లి గ్రామంలో ఈ పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో సుమారు 4 కోట్ల రూపాయల వ్యయంతో పను లు చేపట్టి పూర్తి చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే ప్రభుత్వం ఇప్పు కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం మొత్తం అరాచక పాలన కొనసాగించి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని దీనితో విసిగివేసారి పోయినటువంటి రాష్ట్ర ప్రజలు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమవుతుందని గ్రహించారు దీనితోనే గత ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం



జగన్మోహన్ రెడ్డిని ప్రజలు తమ ఓటుతో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని తద్వారా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్య మంత్రి మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన కొనసాగుతున్నదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మతిభ్రమించి ఆంధ్రుల చిరకాల కోరిక అయిన టువంటి అమరావతిపై లేనిపోని రాద్ధాంతం సృష్టిస్తున్నారని అదే అమరావతి గడ్డపై అనేక కంపెనీలు వేల కోట్ల రూపాయలు పెట్టి కంపెనీలు స్థాపించేందుకు పెట్టుబడి దారులు ఎదురుచూస్తున్నారని అన్నారు. కావున ఇలాంటి మంచి ప్రభుత్వాన్ని ప్రజలు చిరకాలం గుర్తుంచుకొని రాబోవు రోజులను కూడా ఈ ప్రభుత్వాన్ని చల్లని చూపులతో ఆదరించాలని ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్ర మంనందు రాయదుర్గం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లీ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కాదలూరు మోహన్, టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎంపీటీసీలు తలారి గంగాధర్, మొండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## అసలు ములుగు ఆసుపత్రిలో ఏం జరుగుతోంది?

**జనోదయ : ములుగు**

జిజిహెచ్‌లో గోల్మాల్ అనే శీర్షికన ఓ తెలుగు దినపత్రికలో కథనం వచ్చిన విషయం తెలిసిందే.ఈ విషయంపై వివిధ ప్రజా సంఘాలు,మెడకల్ యూనియన్లు విచారించి చూడగా అది నిజమేనన్న వాస్తవం రుజువు అవుతోంది. జిజిహెచ్ లో పేషెంట్లు టాయిలెట్స్ సరిగా లేకుండా మూత్రాన్ని వాటర్ బాటిల్లలో పట్టి పై అంతస్తులో ఉన్నవారు కిందికి పడవేస్తున్నారు. ఇంతటి దుస్థితిలో హాస్పటల్ ఉన్నందున రోగులు చాలా ఇబ్బందికి గురి అవ్వడమే కాకుండా మానసికంగా వారు ఎన్నో అవస్థలు పడుతున్నారు. జి జి హెచ్ లో బండారుపల్లి రోడ్డులో గల హాస్పిటల్ హాస్పిటల్ గోదాంలో దాచి ఉన్న పనికిరాని స్క్రాప్‌తో పాటు విలువ చేసే వస్తువులను కూడా బహిరంగ టెండర్ లేకుండా ఒక కాంట్రాక్టర్కు అప్పచెప్పారు అనే విషయం తెలిసింది. ఈ విషయాన్ని ఆరా తీయగా సదరు పత్రికలో ప్రచురించినట్టు రెండు టన్నుల 50 కిలోల బరువు గల స్క్రాప్ తీసుకోబోతున్న డీసీఎం వ్యాను కూడా ఫోటోలో చిక్కింది. ఇదంతా హాస్పిటల్ యజమాన్యానికి తెలిసే చేస్తున్నారని కొందరు వాపోయారు. ఇంత విలువ గల సామాను ములుగులో గల వ్యాపారుల నుండి లో కొటేషన్స్ తీసుకొని వారి స్వలాభం కోసం ఇంతకుముందు ఆస్పటల్ ఏడీగా పనిచేసిన మహబూబాబాద్‌లో అతనికి పరిచయం ఉన్న వ్యాపారికి ఇప్పుడు ఇక్కడ పనిచేస్తున్న అధికారి అమ్మారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఎందుకంటే ఒక పత్రికలో వచ్చిన కథనం తర్వాత కలెక్టర్ చెప్పిన విధంగానే మేము అమ్మినాము అని సదరు అధికారి చెప్పారు. అయితే పత్రిక ముఖంగా గాని కలెక్టర్ అమ్మమని ఇచ్చిన ఆర్డర్ కాపీ గాని లేదా బయోమెడికల్ నిర్ధారించిన కమిటీ తీర్మానం గాని కండోమినేషన్ కమిటీ ఇచ్చిన తీర్మానం గాని ఇంతవరకు చూపెట్టడంలో విఫలమయ్యారు. దీనిని బట్టి చూస్తే ఇంతకుముందు టీబీ హాస్పిటల్ లో ఉన్న పనికి వచ్చే వస్తువులను కూడా వారు గుట్టుచప్పుడు కాకుండా వారి కమిషన్ల కోసం అమ్మినారా అనే అనుమానం కల్గుతోంది? అందులో మాన్యువల్ ఎక్స్రే మిషన్ ఆపరేషన్ సెక్షన్ ఆపరేటర్లు ఇప్పుడు కూలగొడుతూ వేయిచున్న షెడ్డులోని బెడ్లు ఇతరత్రా సామాగ్రి ఉండడం వల్లనే డీసీఎంను కాంట్రా రెండు టన్నుల 50 కిలోలుగా తూకం వచ్చిందని అతి పెద్దదైతే అంత బరువు ఎందుకు ఉంటుందనే అనుమానం అందరికీ వస్తుంది . ఇట్టి విషయంపై పునరాలోచించి బాధ్యులపై చర్య తీసుకోవాలని అదేవిధంగా ఫార్మసీ నుండి చెక్ లిస్ట్ తీసుకొని ఏ ఏ వస్తువులు కండోమినేషన్ గురి అయినా ఏ వస్తువులు మొనగాడ లో ఉన్నాయో దీంట్లో ఏవి అన్నారు ఇవి ఉన్నాయో ప్రజలకు చూపించవలసిందిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రధాని అభిప్రాయం ఉన్నందున కచ్చితంగా పత్రిక ముఖంగా తెలియజేయవలసి ఉంటుంది. ములుగు ఆసుపత్రిలో స్టాఫ్ లేనందున వేరే హాస్పటల్ నుండి నర్సింగ్ ఆఫీసర్లను తీసుకువచ్చి వైద్య సేవలు అందించడం జరుగుతోంది . ఈ మధ్యకాలంలోనే ఫార్మసీగా డీఎన్ఏ కి వచ్చిన ఫార్మసిస్టును సెలవులపై పంపించడం వల్ల అసలు నిజం బట్టబయలవుతోంది. ఉద్యోగులు లేకుండానే హాస్పిటల్ నడిపిస్తుంటే వచ్చిన ఫార్మసిస్ట్ ను ఎలా లీవ్ పై వెళ్లగొడతారని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పుడు పని చేస్తున్న



ఫార్మసిస్టులు ఏటునాగారం ఏరియా హాస్పిటల్ కు చెందిన వారు కాగా వారితోనే ములుగు హాస్పిటల్ లో ఫార్మసీ విభాగం పనిచేస్తుంది. ఫార్మర్స్ కి వచ్చిన ఫార్మసిస్టును వీళ్లను రిలీవ్ చేయకుండా ఆ ఫార్మసిస్టులను లీవ్ లో పై వెళ్లడం ఏంటి అనే ఆలోచన అందరికీ వస్తుంది . కావున ఈ స్క్రాప్ పై పూర్తి విచారణ జరిపి లక్షలాది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని అదేవిధంగా మొన్న వెంకటాపూర్ లో ఆటో బోల్తా పడిన సంఘటనలో మంత్రి సీతక్క వచ్చిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేనందున మంత్రి చాలా ఆగ్రహానికి గురి అయ్యారు. మంత్రులు క్షతగాత్రులను పరామర్శించి వారికి సరైన వైద్య సేవలు అందించేలా సూపరింటెండెంట్‌కి ఫోన్ చేయడం జరిగింది . తర్వాత పది పదకొండు గంటల సమయంలో సూపరింటెండెంట్ వచ్చి హడావుడి చేస్తున్న తరుణంలో ఒక మహిళ పేషెంట్ సూపరింటెండెంట్ ఎదురుగా మంత్రి అందరూ వచ్చి వెళ్ళాక ఇప్పుడు మీరు వచ్చి హడావుడి చేస్తున్నారు ఎందుకని ప్రశ్నించడం గమనార్హం. మేము వచ్చి దాదాపు 3:00గంటలు అవుతున్న ఇంతవరకు ఒక వైద్యుడు రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ రకాల సమస్యల గురించి పై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బాలికలు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



**జనోదయ, హనుమకొండ, ఏప్రిల్ 15:**

బాలికల భవిష్యత్తు బలంగా ఉండాలంటే విద్యే ప్రధాన ఆధారం అని, బాల సదనంలో ఉన్న ప్రతి విద్యార్థిని మంచి లక్ష్యాలతో కృషి చేస్తూ బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు.బుధవారం హనుమకొండ సుబేదారిలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల బాల సదనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల సదనంలోని బాలికల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి ఉత్తమ సంరక్షణ, విద్యా అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. దత్తతకు సంబంధించిన దరఖాస్తులు వచ్చిన పక్షంలో, బాలికల గార్డియన్ సమ్మతితో పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. సందర్శన సమయంలో లక్ష్మీ ప్రసన్న అనే బాలికకు పుట్టిన రోజు కావడంతో, జిల్లా కలెక్టర్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదించడం ద్వారా బాలికలో ఆనందం నింపారు.అనంతరం బాలికల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూసి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బాల సదనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, కౌన్సిలర్లు త్రివేణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.